

కేంద్ర వైద్య బృందం భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది

ఆరోగ్య కేంద్రంలో కేంద్ర వైద్య బృందం తనిఖీ

ముషీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కేంద్ర వైద్య బృందం శనివారం ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర వైద్య బృందం డాక్టర్లు కవిత, మాళవికలు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డితో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎంత మంది రోగులు వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారని, గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయా, నార్మల్ డెలివరీలు ఎన్ని అవుతున్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు రోగులకు అందించాల్సిన సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి మనోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర వైద్యబృందం సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. ఆసుపత్రి పీహెచ్‌ఎన్‌లు కమలమ్మ, ఫెల్లీస్, ఏఎన్‌ఎం విజయకుమారి పాల్గొన్నారు.



వృద్ధులకు పరికరాలను అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు

స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవాలి

కవాడిగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సూచించారు. శనివారం నీలాద్రి చిట్‌ఫండ్ సంస్థ, అప్సా స్వచ్ఛంద సంస్థ, హెల్పేజ్ ఇండియా సహకారంతో పేద వృద్ధులకు కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని బండానగర్ కమ్యూనిటీ హాలులో వృద్ధులకు వీల్ చైర్స్, వాకర్ స్టిక్స్, వెస్ట్రన్ టాయిలెట్ పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీలాద్రి చిట్‌ఫండ్ ప్రతినిధులు, హెల్పేజ్ ప్రాజెక్ట్ రాష్ట్ర మేనేజర్ శ్యామ్ మాట్లాడుతూ.. వృద్ధుల సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో ఆశిష్, అప్సా నాయకుడు బొట్టు రమేష్‌తో పాటు నాయకులు కార్యకర్తలు స్వచ్ఛంద సేవా సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఇందిరాపార్కులో పద్మశాలీ మేళా

కవాడిగూడ జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కులో 46వ పద్మశాలీ మేళా ఆదివారం నిర్వహిస్తున్నట్లు మేళా కమిటీ సలహాదారుడు రచ్చ నాగరాజు తెలిపారు. ఈ మేళాకు నగర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. పద్మశాలీ మేళాలో వివాహ పరిచయ వేదిక, మెడికల్ క్యాంపులు. క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యావంతులు, కులపెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని ఆయన తెలిపారు.

గోరక్ష చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలం



గోవులకు దాణా తినిపిస్తున్న మహేష్ అగర్వాల్

బర్కత్‌పుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గోరక్ష చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆరోపించారు. జాతీయ పశు సంక్షేమ వజ్రోత్సవాల సందర్భంగా శనివారం గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశువులకు దాణా అందజేశారు. పశువుల అక్రమ రవాణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గోరక్ష చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. గో ఆధారిత ఉత్పత్తులలో ఆసక్తి గల వారికి గోశాల నిర్వాహకులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రేమ్‌చంద్, వినోద్, కాత్యాయని, గోశాల సభ్యులు మనోహర్‌రాజు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రముఖులకు ఇట్‌క్లా సత్కారం



ప్రముఖులకు సత్కారం చేస్తున్న ధర్మారావు

చిక్కడపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా ఇట్‌క్లా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు విలువైనవని హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం విశ్రాంత సంచాలకులు డా.పాలకుర్తి మధుసూదనరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం చిక్కడపల్లిలోని ఇట్‌క్లా కార్యాలయంలో మధుసూదనరావు, సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ రఫీలకు సంక్రాంతి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఇట్‌క్లా వ్యవస్థాపకులు డా.కె.ధర్మారావు మాట్లాడుతూ పాలకుర్తి మధుసూదనరావు సాంస్కృతిక రంగానికి అందిస్తున్న సేవలు గొప్పవన్నారు. కిన్నెర రఘురామ్, సత్కళాభారతి సత్యనారాయణ, విజయకుమార్, కథక్ నృత్య గురువు పండిట్ అంజుబాబు, ప్రముఖ గాయకులు డీప మిత్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తేజావత్ రామ్‌దాస్, చిత్రంలో కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

దేశఖ్యాతిని ఇనుమడింపచేసిన వివేకానందుడు

చిక్కడపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడు దేశఖ్యాతిని ఇనుమడింపచేశారని నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం అడిషనల్ డీసీపీ తేజావత్ రామ్‌దాస్ అన్నారు. తెలుగు భాషా చైతన్యసమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో స్వామి వివేకానంద జయంతిసభ ప్రముఖ కవి, విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తేజావత్‌రామ్‌దాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు మానవాళి మనుగడకు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చికాగోలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం ప్రపంచాన్నే ఆకట్టుకుందన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బడేసాబ్, ప్రముఖ సాహితీవేత్త రాధాకుసుమ, బాలాచారి, గంటా మనోహర్‌రెడ్డి, సరోజినీదేవి, అంజనీకుమారి, శ్రీనివాస్‌యాదవ్, చంద్రప్రకాష్‌రెడ్డి, అనంతరామకృష్ణశర్మ, గజవెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీరు, సీవరేజ్ పనులు పూర్తి చేయాలి

చిక్కడపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి, సీవరేజ్ పనులు పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వాటర్‌వర్క్స్ జీఎం రామకృష్ణను కోరారు. డివిజన్‌లో పెండింగ్‌లో వాటర్‌బోర్డు అభివృద్ధి పనులపై శనివారం వాటర్‌వర్క్స్ జీఎం రామకృష్ణతో జలమండలి కార్యాలయంలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ద్వారా మంజూరు చేయబడిన నూతన పైప్‌లైన్ పనులను ఎందుకు పరిష్కరించడంలేదని జీఎంను ప్రశ్నించినట్లు వివరించారు. సమీక్షలో వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతకే అధిక ప్రాధాన్యం

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

బర్కత్‌పుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్లోబలైజేషన్ ప్రపంచ వ్యాప్తంగా విద్యాసంస్థలను ఎంతో ప్రభావితం చేస్తుందని, సమాచార మార్పిడి మొదలు అన్ని రంగాల్లోనూ ఆధునిక సాంకేతికతకే అధిక ప్రాధాన్యం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి ఎ.శ్యామలదేవి మహిళా కళాశాలలో 'ఇన్నోవేటివ్ టెక్నిక్స్ - ఇప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌లు అనే అంశంపై జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. దేశ జనాభాలో 65 శాతం మంది 30 ఏళ్లలోపు ఉన్నారని, ఇలాంటి యువతతో కూడిన దేశానికి గుణాత్మక విద్యను అందించడం ముఖ్యమన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదితకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్యకుమారి, డాక్టర్ ఎన్.సి.హెచ్.భట్టాచార్యులు, డాక్టర్ పి.హెచ్.అమర్‌నాథ్ దేశిక్, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతాదేవీ, లెక్చరర్స్ దీపానాయక్, స్వాతిశ్రీ, శిరీష, డాక్టర్ ఎస్.రమణ, డాక్టర్ శారద, డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి



గణతంత్ర వేడుకల ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులు

అంబర్‌పేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులు స్వాతంత్ర్య యోధులను ఆదర్శంగా తీసుకోవాలని అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ హైమావతి స్కూల్ ప్రిన్సిపాల్ నిరంజన్ అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని హైమావతి స్కూల్‌లో శనివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం రచించారని పేర్కొన్నారు. రాజ్యాంగం భారత ప్రజలందరికీ హక్కులు, బాధ్యతలను అప్పగించిందన్నారు. పౌరులందరూ రాజ్యాంగాన్ని చదవాలన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకపాత్ర

బర్కత్‌పుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని అంబర్‌పేట సర్కిల్ 16 డీఎంసీ మారుతిదివాకర్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకుని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఓటు హక్కుపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జీహెచ్‌ఎంసీ నోడల్ ఆఫీసర్ రజిత, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటాలకు సన్నద్ధం

సీపీఎం నగర కార్యదర్శి వెంకటేష్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎం.వెంకటేష్ ఎం.మహేందర్ తదితరులు

గోల్నాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ రాష్ట్ర నాలుగవ మహాసభలు జరుగుతున్న సందర్భంగా శనివారం పార్టీ అంబర్‌పేట జోన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎం.వెంకటేష్, పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.మహేందర్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీపీఎం పార్టీ నాలుగవ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో జరుగుతున్న సందర్భంగా గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ చేసిన పోరాటాలు, ఆందోళనలు సమీక్ష చేసుకొని భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకొని ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. మహాసభలలో ఈ విషయాలపై చర్చించి ప్రజలను ఏకం చేసి ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, సుబ్బారావు, సోమన్న, షబానా, నాయకులు నిరంజన్, మోహన్, నాగేందర్, ఏసు, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

'నూతన ఫ్లై ఓవర్‌కు పుంజాల పేరు పెట్టాలి'

కవాడిగూడ: తెలంగాణలో నూతనంగా ప్రారంభించబోయే ఫ్లై ఓవర్‌కు కేంద్ర మాజీమంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ పేరు పెట్టాలని కోరుతూ ఎలిగేటి మహేష్, రాసూరి విజయేందర్‌ల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పుంజాల శివశంకర్ అనేక సేవలు అందించారని అన్నారు.

ముప్వన్నెల మురిపెం



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కాచిగూడ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ముప్వన్నెల రంగులతో స్టేషన్ ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు. శనివారం సాయంత్రం నుంచే కాచిగూడ రైల్వేస్టేషన్ భవనం జాతీయ జెండా రంగులతో ధగధగలాడుతుండడం చూసి ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. మదినిండా స్వాతంత్ర్య సమరయోధులను తలచుకుంటూ ముందుకు కదిలారు.

- హైదరాబాద్‌సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)

గౌడలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం సిద్ధం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బాల్‌రాజ్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

మంత్రి పొన్నం ప్రభాకర్

రాంనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తామని, సంక్షేమ పథకాలలో తగిన వాటా ఇస్తామన్నారు. సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయక కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్ నాయకులు ఆయిలి వెంకన్నగౌడ్, దుర్గగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.

ఎరుకల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు నేతృత్వంలో సంఘం ప్రతినిధులు శనివారం నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఎరుకల కులస్తుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి ప్రభాకర్ ఆవిష్కరించారు. కూతాడి రవికుమార్, వనం రమేష్, నరసింహ, యాదగిరి, శ్రీరాములు, ఎల్లయ్య, రాజశేఖర్, సదానందం పాల్గొన్నారు.

రంగానగర్ యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు విజయం

ముషీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికల్లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఘనవిజయం సాధించారు. రంగానగర్ కమ్యూనిటిహాల్‌లో జరిగిన ఎన్నికల్లో స్థానికంగా 190 ఓట్లు ఉండగా 189 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో వై.శ్రీనివాస్‌రావుకు 113 ఓట్లు పోలుకాగా సుక్కా నాగేష్‌కు 78 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు వై.శ్రీనివాస్‌రావును అధ్యక్షునిగా ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పానుగంటి వినోద్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... తనపైనమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ ఇన్‌చార్జి పి. మహేష్, వై.మల్లేష్, ఈశ్వర్, శంకర్, ముప్పిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన వై.శ్రీనివాస్‌రావును పలువురు ఘనంగా సన్మానించారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన కారు

● ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు.. ● నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణం ● బంజారాహిల్స్‌లో ఘటన

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది.

దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అఖిల్ (ఫైల్)

రాంనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లకుంట పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట బాయమ్మగల్లీలో నివాసం ఉంటున్న వి.విజయ్, స్వరూపల పెద్ద కుమారుడు అఖిల్ నారాయణగూడలోని ఆకాష్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లారు. వారు తిరుపతిలో ఉండగానే అఖిల్ కళాశాలకు రాలేదని, అతడి పుస్తకాలు కాలేజీలోనే ఉన్నాయని వచ్చి తీసుకెళ్లాలని సమాచారం అందించారు. శనివారం 12 గంటల సమయంలో తల్లిదండ్రులు కాలేజీకి వెళ్లగానే ఇంట్లో ఉన్న అఖిల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు కాలేజీ నుంచి వచ్చి చూసేసరికి ఉరి వేసుకుని అఖిల్ కనిపించాడు. వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి అప్పటికే చనిపోయాడ ని వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'హెబ్రోన్ చర్చి వివాదంపై విచారణ జరిపించాలి'

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి వద్ద ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు, మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు, పాస్టర్‌లపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని జంటనగరాలకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డి.బాబూరావు, జోయల్ జశ్వంత్ తదితరులు మాట్లాడుతూ.. వివాదాలు విషయంలో ఇరువర్గాలు మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని కానీ దాడులు సరికాదన్నారు. చర్చి వివాదంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని చర్చి సభ్యులు ఎం.రాబిన్ ఫ్రాన్సిస్, పాస్టర్ జాన్ స్టీవార్డ్, రిచర్డ్ తదితరులు అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరిపించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్తేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాలలోకి రావాలి: ఆర్.కృష్ణయ్య



ర్యాలీలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాలలోకి రావాలని, లేకపోతే దేశ ప్రతిష్ఠ దిగజారిపోతుందని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. నేడు దేశానికి నిస్వార్థ రాజకీయాలు అవసరం అని ప్రధాని మోదీ ఆ దిశలో అడుగులు వేస్తూ అవినీతికి తావులేని భారత్‌ను అగ్ర రాజ్యంగా నిలపడమే లక్ష్యమన్నారు. శనివారం భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు నిండిన సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులతో తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి యువత జాతీయ భావాలను నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని రాజకీయాలలోకి వస్తే మంచి భారతదేశాన్ని నిర్మించుకోవచ్చని అన్నారు. జాతీయతా భావాలను పెంపొందించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు వెంకటేష్, సి.రాజేందర్, నందగోపాల్, ఉదయ్‌నేత, అనంతయ్య, రాందేవ్ మోదీ పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

కవాడిగూడ: దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులను స్మరించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో దోమలగూడ మైసమ్మబండలోని అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి నివాళులు అర్పించారు.

అంబర్‌పేటలో వివాహిత ఆత్మహత్య

అంబర్‌పేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డబ్బుల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరించి సదరు డబ్బులు తీసుకున్న వ్యక్తి సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. బాగ్‌అంబర్‌పేట గంగాబౌలికి చెందిన రాజు, శైలజ(29) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా పనిచేస్తుండగా శైలజ ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో సంవత్సరం క్రితం శైలజ తమ ఇంటి పక్కన నివాసం ఉండే ఓ ఆటోడ్రైవర్‌కు తమకు తెలిసిన వారి దగ్గర 4 లక్షల రూపాయలు మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించింది. అప్పు ఇచ్చిన వారు తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని రాజు, శైలజలపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో గత కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 24వ డబ్బుల విషయంలో రాజు భార్యతో గొడవ పడి డ్యూటీకి వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన శైలజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శైలజ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణ ద్వారానే షెడ్యూల్డ్ కులాల ఐక్యత సాధ్యం

రాంనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ద్వారానే షెడ్యూల్డ్ కులాల ఐక్యత సాధ్యం అని ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సంఘీభావ కమిటీ కన్వీనర్ అప్పికట్ల భరత్‌భూషణ్ పేర్కొన్నారు. మేమెంతో మాకంతా వాటాను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ సంఘీభావ కమిటీ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను గౌరవించాలని, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలని సూచించారు. అనంతరం బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లె వీరస్వామి మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న ఏ కులానికి అన్యాయం జరగకుండా వాటాలు జరగాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నతానియోల్, డాక్టర్ చీమ శ్రీనివాస్, డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, ప్రొఫెసర్ ముత్తయ్య, జూపాక సుభద్ర, కృపాకర్ మాదిగ, పి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పాటలతో ప్రజాచైతన్యం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై పాటలు రాస్తూ ప్రజల్లో చైతన్యం నింపాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రచయితలను కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత భూతం ముత్యాలు రాసిన, ప్రజా నాట్యమండలి గాయకుడు పల్లె నరసింహ పాడిన అంబేడ్కర్ పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే కుట్రలు పన్నుతోందని, రాజ్యాంగ రక్షణ కోసం పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సమాజంలో మార్పు కోసం కవులు, కళాకారులు ఇలాంటి రచనలు మరిన్ని చేయాలన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాలని తీసుకొని భూతం ముత్యాలు అద్భుతమైన పాటలు రాయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిట

నల్లకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణపక్షం షట్తిల ఏకాదశిని పురస్కరించుకుని శనివారం నల్లకుంట డివిజన్‌లోని వైష్ణవ ఆలయాలు భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో అర్చక స్వాములు అప్పారావు, గౌరీల నేతృత్వంలో సీతారాములకు పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామశర్మ మంత్రోచ్చారణ నడుమ నవగ్రహ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.